# ఉపదేశం

కృష్ణమూర్తికి ఇంకో పేరుంది. ఆ పేరుతోనే అతన్ని పిలుస్తారు. తలమీద తెల్లని తలపాగా, చేతిలో మునకాల కర్రతో ఎవడొస్తాడో చూస్తానన్నట్లు చెరకు మడి దగ్గర నిలుచున్నాడు మూర్తి. ఇతను ప్రస్తుతం గడ్డాలూ, మీసాలూ పెంచాడని సాధువుల్లో చేరినట్లు కాదు. అలా పెంచడానికి అసలు కారణం తెలుసుకోకుండా చెరకు మడి దగ్గరకు వచ్చిన ధర్మరాజు "వేదాంతిలా ఉన్నావు, భేష్!" అన్నాడు.

"ఉత్పత్తి చేసినవాడిని వేదాంతి అంటున్నావు. ఏదీ ఉత్పత్తి చెయ్యని నిన్నేమనాలో?" అన్నాడు కటువుగా కృష్ణమూర్తి.

మూర్తి స్వరం కోతకోసిన రంపంలా ధర్మరాజు గుండెలోనికి దూసుకుపోయినా, తను వచ్చిన పని కావాలంటే నిదానం శ్రేష్ఠమని తగ్గాడు.

"పొగడ్తతో పెరుగుతావనుకున్నాను" అన్నాడు కృత్రిమ హాసంతో

"నీ మాట పొగడ్తా, తెగడ్తా? వేదాంతులు కబుర్లు చెప్పారు గానీ కార్యాలు చెయ్యరు. ఇద్దరు వేదాంతు లిక్కడుండగా నన్నెందుకు వేదాంతిని చేసి తెగడ్తావు?" మూర్తి కోపం ఇంకా తగ్గలేదు.

"ఇంకో వేదాంతి ఎవరు?"

"నీతో వచ్చి అదిగో ఆగిపోయిన కుబేరరావు. నీ స్నేహితుడు."

"మేం మాకోసం రాలేదు. చూడు – అంత దూరంలో కుప్పలా కూలిపోయి ఉన్నాడు, కుచేలయ్య. వాడి బాబోగులు చూడ్డానికి వచ్చాం. వాడి ఆర్తనాదం వినపడలేదా?"

"మా ఇద్దరి మధ్య మీ కెందుకు? మీరు పొండి. మేమూ మేమూ ఒక్కటై చూసుకుంటాం" అన్నాడు మూర్తి.

"నన్ను నిలబెట్టింది నువ్వూ, కుచేలయ్యా. మీ నీడలని మీరు వదిలించుకోగలరా? లేరు కదా! అలాగే నన్ను వదిలించుకోలేరు. చూడు అటు" అన్నాడు ధర్మరాజు.

కృష్ణమూర్తి వాయవ్య దిక్కుకు చూశాడు. దూరాన ఉన్న పంచదార ఫ్యాక్టరీ గొట్టంనుంచి పొగ వస్తూనే ఉంది.

"ఆ పొగ ఆగిపోయిందో, అక్కడ కార్మికుల సంగతి నీకు తెలీదు. ఆ కార్మిక సంఘం ఎలాంటి మనుషుల చేతిలో ఉందో తెలుసా? ఫ్యాక్టరీని కాల్చేస్తారు. ఊరిని ధ్వంసం చేస్తారు."

"నన్నేం చెయ్యమంటావు?"

"నీ పొలం చెరకును ఫ్యాక్టరీ కిచ్చి..."

"ఆ కుబేరరావు అన్న ధర నాకు కిట్టదు."

"ఉత్పత్తి చేస్తున్నానని ఇంత గొంతెమ్మ కోరికా?"

"నాదా గొంతెమ్మకోరిక? వాటర్ రేటు పెంచావు. కరెంటు రేటు కోత చేస్తానన్నావు. చేశావు కాదు. నీ నినాదాలు కావుగానీ లేబరు రేటు బాగా పెరిగిపోయింది. రేటుకు తగ్గట్టు పని పెరగలేదు – తరిగిపోయింది."

"ఎరువుల ధర గిట్టుబాటు లేకపోయినా, కోతకోసి అమ్మలేదా?"

"దేని ధర ఎందుకు పెరుగుతుంది, చెప్పు?"

"దానికి చాలా కారణాలుంటాయ్."

"ముఖ్యకారణం నన్ను చెప్పమంటావా? నువ్వు చెప్తావా?"

"నువ్వే చెప్పు, వింటాను."

"నువ్వు మామూలు మనిషిగా చాలా తేలిగ్గా తిరిగావు. నాలాగే బతికావు. ఆదుకుంటావని అధికారం ఇస్తే కోట దుర్గంలో దూరిపోయావు. ఎక్కడి కెళ్ళినా ముందూ వెనుకా వాహనాల మలారం. నువ్వు ఒక్కడివే గానీ నీ బరువెంత పెరిగిపోయిందో! నీ దుర్గం కాపలాకీ, నీ వాహనాల పెట్రోలికీ...నీ అడ్డమైన అట్టహాసానికైన ఖర్చులకీ – ఈ చెరుకు పంటలో కొంత భాగం భరిస్తోంది... అవన్నీ తగ్గించు – నా చెరకు ధర తగ్గిపోతాది."

"అయితే చెరుకు ఫాక్టరీకి ఇవ్వనంటావ్?" కళ్ళెర్రజేశాడు ధర్మరాజు.

"ఇవ్వనంటే ఇవ్వను."

"మళ్ళీ అడుగుతున్నాను. ఇవ్వక ఏం చేస్తావ్?

"వంటచెరుకు చేసి కాల్చేస్తాను, కానీ ఇవ్వను."

చర్రున తిరుగుముఖం పట్టి రోడ్డెక్కి కా రెక్కి పరివారంతో పరుగుతీశాడు.

విచిత్రం! కుబేరరావు వెళ్ళిపోలేదు. ధర్మరాజు బరువుగా కనిపించని బరువు మనిషైతే, ఇతగాడు బరువుగా కనిపించినా తేలికైన మనిషిలా ఉన్నాడు. మనిషి అట్టహాసంగా కనిపించినా, మాటల్లో, నడతలో ఆ అట్టహాసం లేదు. మాటల్లో వినయం ఉట్టిపడుతోంది. ఇతను అధికారం అన్న భుజకీర్తులు తగిలించుకోలేదు. కాబట్టి బతిమాలి పని జరిపించుకునే మనిషిగా పేరు పొందాడు. మంచి మాట ఆడి ఎదుటివారిని నొప్పించకుండా తన పని జరిపించుకునే మనిషి. మంచి మాట చాలకపోతే మంచి మూటను అప్పగించి పని జరిపించుకునే తత్వం. అందుకే ధర్మరాజు ఆ చుట్టుపక్కల నుంచి మాయమైపోగానే మెల్లగా చెరకు మడివేపు కదిలాడు. ఏమీ జరగనట్లు పొలం గట్టున కృషిమూర్తి ఆ రోజు పేపరు పట్టుకుని చదువుకుంటున్నాడు.

కుబేరరావు మెల్లగా నడుస్తూ, చల్లగా కృషిమూర్తి పక్కన చతికిలపడ్డాడు. "మూర్తి బాబూ... ఒక మాట చెప్పడానికి వచ్చాను."

ఒకసారి తల పైకెత్తి చూసి పేపరు మీద ధ్యానం పెడుతూ "చెప్పు" అన్నాడు మూర్తి.

"ధర్మరాజు ఆ కుచేలయ్యలాగే కింద పడుంటే నిలబెట్టిం దెవరు? నువ్వేనా? నువ్వు చెరుకును ఉత్పత్తి చేస్తున్నావు. నేను ఆ చెరుకుని పంచదారగా మారుస్తున్నాను. మనిద్దరిదీ ఒకమాట కాకుండా మధ్యన దళారిగా నువ్వు నిలబెట్టిన మనిషే మారిపోయాడు. ఏమంటే పరిపాలనకి ఈ ట్రిక్కులన్నీ అవసరం అంటాడు. నా పరిస్థితి కాస్త ఆలోచించు!"

"ఆలోచించవలసిం దేమిటో?"

"అటు ఫాక్టరీ ఆగిపోయి కార్మికుల పనిపోయినా, ఈ కుచేలయ్య పంచదారో అని గగ్గోలు పెట్టి సొమ్మసిల్లినా... అటు నుంకాలు ధర్మరాజుకు చెల్లించకపోయినా... ఇటు నీకు గిట్టుబాటు ధర ఇవ్వకపోయినా... అందరిచేతా పోట్లు తిన్నవాడిని నేనేనా? నామీద కాస్త కనికరం చూపించి ఈ చెరుకు ఇచ్చే..." అని బ్రతిమాలుతున్నట్లు గెడ్డం పట్టాడు.

"అలా తోసేకు. నువ్వు లేకపోతే నేను లేను. మనిద్దరం లేకపోతే ధర్మరాజు లేడు. ముగ్గురం కలిస్తే గానీ కుచేలయ్య నిలబడలేడు. ఇది ఈనాటి సంబంధం కాదు. మనిషి బతకడం నేర్చిన దగ్గర నుంచీ ఉంది."

కృషమూర్తి పేపరు పక్కకు నెట్టి నవ్వుతూ – "పండించింది నేను. అనుభవించింది నువ్వు" అన్నాడు.

"ఇద్దరం బాగుపడితేనే... ఆ మూడోవాడు కుచేలయ్య బాగుపడతాడు."

"బాగు–నేను మిద్దె వేసుకుంటే... నువ్వో.... ఎక్కడున్నావ్? ఎలా బతుకుతున్నావ్? ఎందుకులే ఇదంతా? నాకు కిట్టదు. నేను ఇవ్వనంటే ఇవ్వను."

"ఇవ్వవా?"

"నేను అడిగిన ధర ఇస్తేనే ఇస్తాను."

"ఆ ధర నాకు గిట్టుబాటు కాదు." కుబేరరావు లేచిపోయాడు. వాయవ్యంవేపు చూశాడు. ఒక్కసారి తల పీక్కుంటూ – "అమ్మబాబాయ్! గొట్టంనుంచి పొగ రాలేదు. కొంప మునిగిపోయింది," అన్నాడు.

"పరవాలేదులే" అన్నాడు ధీమాగా మూర్తి. "ఇవ్వన్నిటికీ కారణం ఎవరు? నువ్వు. నీ కొంపకి నిప్పంటించరు. ముందు నా కొంప కూలిపోతుంది."

"అది అంత గొప్ప భయానకమైన దృశ్యం కాదు. రా కూర్చో – ఇంకెంతసేపో పట్టదు. ధర్మరాజు వస్తాడు."

"నీతో వస్తానని చెప్పాడా?"

"చెప్పకపోయినా రావాలి. వస్తాడు. ఒక్కడూ రాడు. ఔనుగానీ... నీకు పేపరు చూసే అలవాటు లేదా?"

"తీరుబడి ఎక్కడ"

"రా కూర్చో. ఈవేళ పేపర్లో అతి భయంకర వార్తలు విను. అవి వింటే నీ కొంప కూలిపోవడం గొప్ప విషయం అనిపించదు. విను విను..." అంటూ కృషిమూర్తి ఒక్కొక్క హెడ్డింగూ చదవడం మొదలుపెట్టాడు.

"విద్యార్థుల పీకలు కోశారు. గ్రామాలకు గ్రామాలే నేలమట్టం చేశారు. పవిత్రమైన నదిలో శవాలు తేలిపోతూ కొట్టుకుపోతున్నాయ్. రాక్షసుడు వికటాట్టహాసం చేసి విహరిస్తూ రక్తం తాగుతున్నాడు."

"పోలీసులు లేరా?"

"ఉన్నా వాళ్ళు చూడకుండా ముఖాలు తిప్పేసి గుడ్డివాళ్ళ మయ్యామన్నారు."

"అక్కడా మరి మన ధర్మరాజు లాంటి వాళ్ళు లేరా?"

"వాళ్ళు వెళ్ళేసరికి, ఒక అమ్మాయి, తనకు నడి బజారులో ఎలా అన్యాయం జరిగిందో చెప్పకుండా, తన కళ్లముందు తన కుటుంబం తాలూకు ఇరవైమందిని ఎలా చంపేశారో అక్కడి ధర్మరాజుతో చెప్తూ పిచ్చిగా ఏడుపుతో కేకలు వేసిందట."

"ఇంకా విను" అంటూ కృషిమూర్తి చదవడం మొదలుపెట్టాడు. "వెయ్యి మైళ్ళ దూరంనుంచి పొట్ట పట్టుకుని కూలికి వచ్చిన ముప్పైమంది రాత్రి ఆరుబయట నిద్రపోతుంటే ఆటోమెటిక్ రైఫిల్సుతో అందర్నీ కాల్చి చంపేశారు.

"ఇచ్చిన దంతా పుచ్చుకుని మరింత కట్నం తేలేదని ఇద్దరు పిల్లలున్నా పెళ్ళాన్ని కాల్చేశా డొక చదువుకున్న పెద్దమనిషి."

"ఇవన్నీ మన దేశంలో జరుగుతున్నాయా?"

"ఇంకా ఉంది. చదివితే నీ గుండే కాదు, నా గుండె కూడా ఆగిపోతుందని భయంగా ఉంది. అందుకే ఆపేస్తున్నాను. ఇవన్నీ వింటే...ఈ సమ్మె ఒక లెక్కా? లాఠిచార్జీలు, బాష్పవాయువుల యుగం పోయింది. ప్రతిదానికీ పేల్చేయడం, కాల్చేయడం ఒక ఫ్యాషన్ అయిపోయింది. ఇవన్నీ చదువుతుంటే నా కనిపిస్తుంది... నే నెందుకు పండించాలి? ను వ్వెందుకు పంచదారగా మార్చాలి? ఇలా చేసి ఇద్దరం పాపం చేస్తున్నా మనిపిస్తోంది."

కృషిమూర్తి మాటలు నోటనే ఉన్నాయ్. అటు కోలాహలం.

"అటు చూడు. ఈ చెరకు తోట కొట్టించడానికి కూలీలూ, వాళ్ళను కాపాడ్డానికి పోలీసులూ వచ్చారు. నీ మిత్రుడు ధర్మరాజు రాకుండా నీ మేలుకోసం ఇదంతా ఏర్పాటు చేశాడు. ఇప్పుడు నీ కొంప కూలిపోదు. పరవాలేదు. ధైర్యంగా ఉండు."

"ఇప్పటికైనా నేనిస్తానన్న ధరకు చెరకు ఇచ్చే" అన్నాడు కుబేరరావు.

"నువ్వు కనీసం నాతో మర్యాదగా మాట్లాడావు. నీ మిత్రుడు ధర్మరాజు కళ్ళెర్రజేసి జడిపించాడు. నువ్వు నష్టపోవడం నా కిష్టం లేదు. చెరుకు తీసుకవెళ్ళడానికి నీ లారీ వస్తుంది కదా. .. ఆ రోడ్డుమీద ఉండు" అని పంపేశాడు.

పోలీసు పెద్ద కృషిమూర్తి చేతికి కాగితం అందిచ్చాడు. అది ఆర్డరు. కాదనకుండా మూర్తి పక్కకు తప్పుకున్నాడు. చెరుకు నరుకుతుంటే అంత దూరం వెళ్ళి నిల్చున్నాడు. కట్టలు కట్టిన చెరుకు లారీలో వేస్తున్నారు. లారీ నిండే సమయానికి మూర్తి అక్కడికి చేరుకున్నాడు. అంతవరకూ మౌనంగా ఉన్న కృషిమూర్తి పక పక నవ్వుతున్నాడు. పిచ్చెక్కిందేమో అని ఆ పోలీసు పెద్ద – "ఎందుకయ్యా నవ్వుతున్నావ్?" అని మూర్తిని పట్టుకుని కుదిపాడు. ఇంకా విరగబడి నవ్వుతున్నాడు మూర్తి.

"ఎందు కలా నవ్వుతున్నావ్?"

"ఆ లారీలో చెరుకు తీసుకెళ్ళేబదులు...మనుషులను కట్టలు కట్టి తీసుకపోతున్నా రేమండీ? ఆ మనుషుల కట్టలని ఆ క్రషర్ల కోరల్లో పడేస్తారా?"

"కుబేరరావుగారూ! ఇతను పిచ్చివాడా?" అని పోలీసు పెద్ద అడిగాడు.

"కొద్దిసేపటి క్రితం పేపరు చదివి మరీ వ్యాఖ్యానించాడండీ... ఇంతలోనే పిచ్చివాడెలా అవుతాడు?"

"సరిగ్గా చూడు – అది నువ్వు పండించిన చెరుకు – మనుషులు కారు" అని మూర్తిని తీసుకవెళ్ళి లారీ వెనుక నిలబెట్టాడు. వెంటనే నవ్వు ఆగిపోయింది.

మూర్తి చాలా నిటారుగా నిల్చున్నాడు. తలమీద పాగా తీసేశాడు. పెరిగిన గడ్డం, మీసాలతో నిజంగా ఒక వేదాంతిలా కనిపిస్తున్నాడు. ఆ తెల్లని తలపాగా పంచెను శరీరం మీద కప్పుకున్నాడు.

"పోలీసు పెద్దగారూ! ఆ లారీ నుంచి ఒక్క చెరుకుగెడ బయటకు లాగండి... సంశయిస్తున్నారేం? నేను నవ్వుతూ అన్నమాటలకు అర్థం తెలుసుకోవాలని ఉంటే...ఒక చెరుకుగడ లాగండి..."

అతను లాగకుండా ఒక జవానుచే లాగించి రోడ్డుమీద వేస్తుంటే... "ఇది మనిషా... చెరుకుగడా? సరిగ్గా చూడవయ్యా పిచ్చివాడా?" అన్నాడు.

"ఆ చెరుకుగడ... చివర్లో ఏముంది? దీనికున్నది కొట్టేశారు. అటు పొలంవేపు చూడండి. ఏం ఉంది?"

"వెన్ను."

"చెరుకు తుద వెన్ను పుట్టిన... చెరుకున తీపెల్ల చెరచు గదరా సుమతీ అన్నది చదువుకోలేదా? "

"అంతేనా?"

"గడ ఎత్తి చూడండి. సరిగ్గా చూడండి."

పోలీసు పెద్ద చెరుకు గడను ఎత్తి చూసి ముట్టరాని దన్నట్లు ఒక్కసారి కింద పడేశాడు.

"అది కుళ్ళిన శవం కాదు. అలా ఎత్తేశారేం?"

"పుచ్చిపోయిన చెరుకు."

"మీకు అనుమానమైతే... ఆ కట్టలన్నీ దించి చూడండి. అన్నీ పుచ్చిపోయిన చెరుకులే..."

"ఈ చెరుకుల్ని మనుషు లెందుకన్నావయ్యా?"

కృషిమూర్తి కిందపడిన చెరుకుగడను ఎత్తి అన్నాడు:

"ఈ చెరుకుగడలానే మానవుడు ముదిరిపోయాడు, పుచ్చిపోయాడు. శాంతిగా, తియ్యగా మానవుడు బతకాలంటే కొత్త మానవ బీజం కావాలి."

పోలీసు పెద్ద అతని ఎదరగా నిల్చుని గౌరవంతో తల వంచి – "మీ ఉపదేశం విన్నాను. మీ రెండో పేరు సెలవిస్తారా?" అన్నాడు.

"కృష్ణమూర్తి!"

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 28–3–1990)*
*(హిందీ అనువాదం: 'తెలుగుకి శ్రేష్ట కహానియా' – మనుప్రకాశ్, ఢిల్లీ, 1997)*

* * *